# ఫ్రాన్స్ మాక్రాన్ ప్రభుత్వాన్ని కుదిపివేస్తున్న సమ్మెలు - ఆందోళనలు

**2018** నవంబర్ 3, 4 వారాలలో విస్తృతమైన ప్రజా నిరసనాందోళనలు, ప్రదర్శనలతో ఫ్రాన్స్ హోరెత్తిపోయింది; నవంబర్ 17న 2 లక్షలమంది నిరసన ప్రదర్శనలలో పాల్గొని ఫ్రాన్స్ దేశ వ్యాపితంగా 2034 చోట్ల రహదారులను దిగ్బంధించి, ప్రభుత్వాన్ని స్థంభింపజేశారు. ఈ నిరసన ప్రదర్శకులలో కార్మికులు, రవాణారంగ డ్రైవర్లు, చిన్న వ్యాపారులు ప్రధానంగా వున్నారు. ఫ్రాన్స్ ప్రభుత్వం పొదుపుచర్యల పేరిట చేపట్టిన ఇంధన పన్ను పెంపుదల, పెన్షన్లలో కోత, కార్మికులపై వివిధ పన్నుల పెంపుదల, కోట్లాధిపతుల సంపదలపై పన్ను తొలగింపు వంటి చర్యలను ప్రదర్శనకారులంతా ముక్తకంఠంతో ఖండించారు.

"ఇంధన పన్నుల పెంపుదల ప్రజల నడ్డి విరుస్తోంది. ప్రైవేటుసంస్థల ప్రయోజనాలకోసమే ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. మేము తిరిగి ప్రజాస్వామ్య పాలనలోకి రావాలని కోరుకుంటున్నాము. వేతనాల పెంపుదల, శ్రామిక ప్రజల పన్నుల తగ్గింపు, ఓటు ఎవరికీ చెందకుండా ఖాళీ ఓటు వేయటానికి హక్కు, అన్ని ప్రముఖమైన చట్టాలను ప్రజాభిప్రాయ సేకరణద్వారా నిర్ణయించే అవకాశం కల్పించాలి. ప్రజల చేతులలోకి తిరిగి రాజకీయాధికారం వచ్చి తీరాలి" అని బిఎఫ్ఎమ్ టి.వి.తో మాట్లాడుతూ ఓ నిరసనకారుడు పేర్కొన్నాడు.

ఇదే తరహా నిరసనలు యూరప్ వ్యాపితంగా జరుగుతున్నాయి. బెల్జియంలో నిరసనకారులు చమురు శుద్ధికర్మాగారాలను దిగ్బంధించారు. బల్గేరియా, సిరియాలలో ఇంధన పన్ను పెంపుదలను నిరసిస్తూ ప్రదర్శనలు, ఆందోళనలు జరిగాయి. గ్రీస్‌లో శ్రామిక ప్రజానీకం ప్రభుత్వంపై నిప్పులు చెరిగే ఆగ్రహంతో సమ్మె చేస్తున్నారు. బుఖారెస్ట్‌లోని మెట్రో రైలు కార్మికులు సమ్మె జరుపుతుండగా, జర్మనీలో అమెజాన్, రియానైర్‌లలో సమ్మెలు జరుగుతున్నాయి.

పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ఫ్రాన్స్‌లో నిరసన కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి. 183 మందిని ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసులు నిర్బంధించారు. "ఇంధన డిపోల జోలికి పోవద్దని, ఇతర సున్నిత ప్రదేశాల నుండి వెనుదిరగాలని పోలీసు అధికారులు ప్రదర్శనకారులను ఆదేశించారు; నిరసనకారు లందరినీ ఒక పద్ధతిగా, సంపూర్ణంగా ఆయా ప్రాంతాలనుండి ఖాళీ చేయించారు" అని ఫ్రాన్స్ ఆంతరంగిక శాఖామంత్రి పేర్కొన్నారు.

ఇంధన పన్ను పెంపుదలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఉద్యమకారులు వారంరోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నివ్వగా, వేలాదిమంది ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ విశ్వవిద్యాలయ సంస్కరణలను వ్యతిరేకిస్తూ, ఇంధన పన్ను పెంపుదల వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా షుమారు 50 పాఠశాల భవనాలను దిగ్బంధించారు. "ఇదేదో కేవలం చాలా పాక్షికమైన, తేలికైన నిరసనాందోళన కాదు; ఫ్రాన్స్ దేశవ్యాపితంగా వివిధ రాష్ట్రాలలో ప్రత్యేకించి మాక్రాన్ రాజకీయ విధానాలతో గాలికొదిలేయబడిన గ్రామీణ ప్రాంతాలలోని ఉన్నత పాఠశాలల్లో చెలరేగిన తిరుగుబాటు" అని దేశవ్యాపిత ఉన్నత పాఠశాల విద్యార్థుల యూనియన్ అధ్యక్షుడు లూయిస్ బ్రోయార్డు ప్రకటించాడు.

అదేసమయంలో ఫ్రాన్స్ దేశవ్యాపితంగా ఇంకా వివిధ సమ్మెలు జరిగాయి. లయన్ అండ్ మాన్స్ ప్రజారవాణా వ్యవస్థలో కార్మికులు, మార్సెల్లీలోని మునిసిపల్ ఉద్యోగులు, లామేడ్‌లో చమురు శుద్ధికర్మాగార కార్మికులు సమ్మెలు కొనసాగిస్తూ వున్నారు. ఫ్లామెన్‌విల్లిలోని అణు విద్యుత్తు కర్మాగారంలోనూ, పైయటూలోని లోహ శుద్ధికర్మాగారంలో ఇంకా అనేక హాస్పిటల్స్‌లో కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు.

ఈ నిరసనలు, సమ్మెల నడుమే 1997లో తాత్కాలికంగా రద్దుచేసిన సార్వత్రిక సైనిక సేవ (యూనివర్సల్ మిలిటరీ సర్వీస్)ను తిరిగి విధిస్తున్నట్లుగా ఫ్రెంచ్ ప్రభుత్వం ప్రకటించింది. "ప్రతి సంవత్సరం కౌమార దశలోని 8 లక్షల మంది బాల బాలికలను ప్రభుత్వం సమీకరించి, వారికి మూడునెలలపాటు సైనిక శిక్షణ నిప్పించి, ఆపై అవకాశాలనుబట్టి సైనిక బలగాలలోకి వారిని ఇముడ్చుకోవటం జరుగుతుంద"ని ఈ నిర్బంధ సైనిక విధానం గురించి వివరిస్తూ ప్రభుత్వం ప్రచురించిన 'లేపెరిసియన్'లో పేర్కొన్నారు. "మన గణతంత్ర విలువల ప్రాతిపదికపై సామాజిక వర్గాలను కలిపేందుకు" ఈ నిర్బంధ విధానాన్ని ముందుకు తెచ్చినట్లుగా ఆ పత్రంలో పేర్కొన్నారు. "సామాజికంగా కలగలవటమనే అంశం 1997 నుండి స్థంభించి పోయింది. కాగా కేవలం యుద్ధరంగంలోని సైనిక విభాగాలకు చెందిన పేద సామాజిక వర్గాల యువకులే మిగులుతారు" అని పేర్కొంటూ అనేకమంది విద్యావేత్తలు ఈ నిర్ణయాన్ని తప్పుపట్టారు.

అయితే మాక్రాన్ ప్రభుత్వ అసలు ఉద్దేశ్యాలు మాత్రం ఇంకా వెల్లడి కాలేదు. 2017లో జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచార సందర్భంగా, ఈ నిర్బంధ సైనిక సేవ ముసాయిదాను ఉపసంహరిస్తానని ఆయన వాగ్దానం చేశాడు. "అంతర్జాతీయ సంబంధాలలో రాజకీయాల ఫలితంగా యుద్ధం తిరిగి సంభవించే అవకాశమున్న నూతన శకంలోకి మనం ప్రవేశించా"మని మాక్రాన్ పేర్కొన్నాడు.

మాక్రాన్ బెర్లిన్ వెళ్ళి, యూరప్ భద్రత అంశమై జర్మనీ ఛాన్సలర్‌తో చర్చలు జరపటాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు వెల్లువెత్తాయి. "దృఢమైన మరింత సార్వభౌమాధికారాలున్న యూరప్"ను మాక్రాన్ ఆకాంక్షిస్తున్నాడు. "ఇతర దేశాలు జోక్యం చేసుకోవటానికి

అవకాశమీయకుండా" ఆ అధికారం ఉండాలని మాక్రాన్ భావిస్తున్నాడు. "యూరప్ సార్వభౌమత్వాన్ని సంపూర్ణంగా చేరుకోవటానికి అవసరమైన సాధనంగా, నూతన ఫ్రాంకో-జర్మన్ సైన్యం పూచీపడ్తుంద"ని ఫ్రాన్స్, జర్మనీల కూడికతో ఏర్పాటయ్యే యూరోపియన్ సైన్యం గురించి పేర్కొంటూ మాక్రాన్ వ్యాఖ్యానించాడు.

"క్రిమియాలోకి రష్యా చొరబాటు, ఉక్రెయిన్‌లో వివాదం, పొరుగు దేశాలలో పెరుగుతున్న సైనిక కార్యకలాపాలు" సాకుగా 2017 సం॥లో సైన్యంలోకి నిర్బంధంగా సమీకరించే ముసాయిదాను స్వీడన్ పునఃస్థాపితం చేసింది. జర్మనీ పాలకులు కూడా నిర్బంధంగా సైన్యంలోకి ప్రజలను సమీకరించే విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టే అంశం గురించి యోచిస్తున్నామని ప్రకటించారు.

సామ్రాజ్యవాదుల మధ్య పదునెక్కుతున్న వైరుధ్యాలను, పెరుగుతోన్న సంక్షోభాన్ని సార్వత్రిక సైనిక సేవను తిరిగి ప్రతిష్టించాలనుకోవటం మనకు సూచిస్తోంది. యుద్ధానికి సన్నాహాలలో భాగంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవటాన్ని ఇది సూచిస్తోంది. అధికారంలో కొనసాగుతున్న పెట్టుబడిదారీ ఆర్థిక, సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఇటీవలి కాలపు నిరసనాందోళనల సందర్భంలోనూ, దేశ వ్యాపితంగా ప్రజానీకంలో ప్రధానంగా యువతలో అసంతృప్తి, ఆగ్రహావేశాలు పెరగటాన్ని గమనించవచ్చు. వీటిని క్రమశిక్షణపేరిట ప్రక్కదోవ పట్టించే లక్ష్యంతో 'సార్వత్రిక నిర్బంధ సైనిక సేవ' అంశాన్ని ప్రజలపై రుద్దుతున్నారని స్పష్టమౌతోంది. జాతీయ దురహంకారాన్ని, తిరోగమన రాజకీయ వాతావరణాన్ని యువతలో సృష్టించేందుకే ఈ విధానం ఉద్దేశించబడింది.

ooooo